కథ

సన్నిహిత్

# వికలాంగుడు

హైదరాబాద్ 'రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్'లో దిగి కేబ్‌లో ఇంటికొచ్చేటప్పటికి సాయంత్రం ఐదు కావస్తోంది. వృత్తిరీత్యా ప్రొఫెసర్ని నేను. ఇంజనీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెప్పడం నేను ఆనందంగా చేసే పని. ముంబయి ఐ.ఐ.టి.లో 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏవియానిక్ సిస్టమ్స్'లో పాల్గొనడానికి వెళ్ళివచ్చాను. నేను ఇంట్లోకి ప్రవేశించేసరికి నా బావమరిది రవి నా పెళ్ళాంతో ఏదో విషయం గురించి సీరియస్‌గా డిస్కస్ చేస్తున్నాడు. వాడ్ని చూస్తే నాకు అదోలాంటి ఫీలింగ్ కలుగుతూ ఉంటుంది. వయసు ముప్ఫై దాటుతున్నా ఏ విషయం మీదా ప్రత్యేకమైన శ్రద్ధ కనబరచడు. అధునాతనమైన ఎలక్ట్రానిక్ పరికరాలు వాడటంలోనూ, జీవితాన్ని బాగా ఎంజాయ్ చేయడంలోనూ అనుభవజ్ఞుడు. ఉద్యోగం, సజ్జోగం లేదు కాబట్టి ఇంకా పెళ్ళి కాలేదు.

"ఆ...రండి. రండి వచ్చారా! కాన్ఫరెన్స్ బాగా జరిగిందా" అంటూ ఆహ్వానించింది నా భార్య.

"బాగానే జరిగింది. ఏంటి నీ తమ్ముడూ, నువ్వూ ఏదో అంతర్జాతీయ సమస్య గురించి మాట్లాడుకుంటున్నారు" జోక్‌గా అడిగాను.

"అదేనండీ...మన రాజులేదూ...సత్యం కంప్యూటర్స్ రామలింగరాజు...ఏదో పెద్ద ఫ్రాడ్ చేసి పోలీసులకి లొంగిపోయాడంట కదా! అదే మాట్లాడుకుంటున్నాం...ఇంతకీ భోజనం చేసారా?" అడిగింది.

"చేసాను. రామలింగరాజు లొంగిపోయాడంటే దానివల్ల నీకుగానీ, నీ తమ్ముడికి గానీ వచ్చే సమస్య ఏమీ లేదుకదా? పనికిరాని విషయాలు మాట్లాడుతూ నువ్వు చెడిందే కాక నీ తమ్ముడిని కూడా చెడగొడుతున్నావు" చిన్నగా మందలించాను.

నా బావమరిది ఎప్పుడో చల్లగా జారుకున్నాడు. ఎప్పుడు ఏం చెయ్యాలో తెలిసిన జ్ఞాని అతడు.

"సర్లెండి. మీరెప్పుడూ నన్నే తప్పుబడుతూ వుంటారు. నాకెందుకొచ్చింది గొడవ" అనుకుంటూ సీరియస్‌గా వెళ్ళి, పదేళ్ళ నుండి ప్రసారమవుతున్న 'జీవన పోరాటం' టీవీ సీరియల్ చూడటంలో మునిగిపోయింది నా భార్య.

* * *

ఆహ్లాదకరమైన చల్లటి గాలి వీస్తున్న సాయంకాలపు ప్రశాంత నేపథ్యంలో...

"ఆప్టిమల్ కంట్రోల్ థియరీ గురించి డిస్కస్ చేయడానికి వచ్చిన పిహెచ్‌డి స్టూడెంట్‌తో ఇంటి దగ్గర బిజీగా ఉన్నాన్నేను. అప్పుడప్పుడు నా స్టూడెంట్స్ ఇలా ఇంటికి రావడం నాకు కొత్త కాదు. రెండు కప్పుల్లో కాఫీ పోసి పట్టుకొచ్చింది నా భార్యామణి. నా కప్ అందుకొని సిప్ చేసి "ఈరోజు మీ తమ్ముడిగారి దర్శన భాగ్యం లేదు. ఏ ప్రాంతాన్ని సర్వే చేస్తున్నారు? కూకట్‌పల్లా? బోయిన్‌పల్లా?" నవ్వుతూ అడిగాను.

"ఏమో తెలీదండీ! పొద్దున్నేగా బయటికి వెళ్ళాడు. ఇప్పటిదాకా అడ్రస్ లేదు. ఎక్కడికి వెళ్ళాడో?" దిగులుగా అంది- ఒక చంటిపిల్లాడు తప్పిపోయిన లెవెల్‌లో బాధపడుతూ.

"ఎక్కడికి వెళ్ళుంటాడు. ఏ ఫ్రెండ్స్‌తోనో సినిమాకో, షికారుకో ప్రోగ్రాం వేసుంటాడు. కంగారుపడకు...వచ్చేస్తాడులే!" అన్నాను.

"ఏమోనండీ!" అంటూ "అయ్యో! నా మతిమండా 'పగబట్టిన పనిమనిషి' సీరియల్ అయిపోతుందేమో అనుకుంటూ టీవీ దగ్గరికి పరుగెత్తింది నా భార్య.

నా బావమరిది రవి మా ఇంట్లోనే ఉంటాడు. రెండేళ్ళ క్రితం అనుకుంటాను, వాళ్ళ నాన్న అతడ్ని తీసుకొచ్చి మా ఇంట్లో పెట్టాడు. అక్కడ- వాళ్ళు సొంతూరులో ఉంటే తిని తిరగడం తప్ప పెద్దగా ఉద్ధరించే కార్యక్రమాలేవీ లేవని, మా దగ్గర ఉంటే క్రమశిక్షణతో బాగుపడతాడని తీసుకొచ్చాడు.

నా కొడుకులిద్దరూ ఇంజనీరింగ్ చదువుకుని, అమెరికా వెళ్ళి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డారు. మేము ఒంటరివాళ్ళం అయ్యాం. దాంతో మాకు తోడుగా ఉంటాడని రవిని మాతో ఉండమని చెప్పాం. అప్పటినుండి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడుగానీ ఒక్కటి కూడా తగల్లేదు. అలాగని తన అసమర్థతల్ని అధిగమనించే పనులేమీ చేపట్టడు. ఒక్కోసారి చాలా హుషారుగా ఉంటాడు. ఇంకోసారి సీరియస్‌గా ఏదో ఆలోచిస్తూ డల్‌గా ఉంటాడు. నాక్కూడా బాధగానే ఉంటుంది. ఇంత వయసొచ్చినా అతడికి స్థిరత్వమంటూ రాలేదని! కాసేపటి తర్వాత, పిహెచ్‌డి స్టూడెంట్ నా దగ్గర సెలవుతీసుకొని వెళుతుండగా నెమ్మదిగా ఇంటికి వచ్చాడు రవి. అప్పటికి చీకటిపడి చాలా సేపయింది.

"ఏం రవీ! ఎక్కడికి వెళ్ళావు?! ఇంతవరకూ ఇంటికి రాకపోయేసరికి మీ అక్క ఎంత కంగారుపడుతోందో తెలుసా? అసలే రోజులు బాగాలేవు" అన్నాను.

"ఏం లేదు బావా! బాలానగర్‌లోని 'సుగుణ ఇండస్ట్రీస్'లో వాకెన్ ఇంటర్వ్యూ ఉందంటే మా ఫ్రెండ్స్‌తో సహా వెళ్ళాను. అబ్బో! చాలామంది కేండిడేట్స్ వచ్చారు. ఉన్నవి రెండు పోస్టులు, వందమంది దాకా వచ్చారు" నీరసంగా చెప్పాడు.

"ఇంతకీ ఇంటర్వ్యూ బాగా చేసావా?" ఆసక్తిగా అడిగాను.

"ఏం బాగా చెయ్యడమో బావా! వెళ్ళగానే రిటన్ టెస్ట్ పెట్టారు. అందులో క్వాలిఫై అయినప్పటికీ తలప్రాణం తోకకు వచ్చింది. వందమందిలో నుండి పాతిక మందిని ఇంటర్వ్యూకి పిలిచారు. ఏదో నాకు తెలిసింది చెప్పాను. చూడాలి ఏమవుతుందో!"

"అంటే ఇంటర్వ్యూలో కాన్ఫిడెంట్‌గా చెప్పలేదా?"

"చెప్పాను. కానీ మనకెవరిస్తారు బావా జాబ్! అయినా ఈ రోజుల్లో అందునా మనలాంటి దేశంలో ఉద్యోగం రావాలంటే రిజర్వేషన్లు, రికమండేషన్లు తప్పనిసరి కదా! నాకు రిజర్వేషన్ ఎలాగూ లేదు. రికమెండేషన్ నువ్వు ఎప్పటికీ చేయించవు. ఇంకెలా వస్తుంది జాబ్? ఏదో నా తలరాత ఇలా తగలడింది. జీవితాంతం నిరుద్యోగిగా ఉంటూ ఇంకొకరి దయాదాక్షిణ్యాలతో బ్రతకాలేమో!" అంటూ ఏడుపు మొహం పెట్టాడు. ఏం చెప్పాలో నాకూ అర్థం కాలేదు. ఇంకాసేపు అలాగే వాడితో మాట్లాడితే ఆ నిరాశావాదం నాకు కూడా అంటుకుంటుందేమో అని భయపడి, నా ముందున్న న్యూస్ పేపర్‌లోకి తల దూర్చాను.

* * *

ఆ రోజు గురువారం!

"ఏమండీ! సాయంత్రం 'బాబా' గుడికి వెళ్దామా?" అడిగింది భార్యామణి.

"సరే! వెళ్దాం" అన్నాను. ఈమధ్య వర్క్ హడావుడిలో పడిపోయి ఎక్కడికీ వెళ్ళడం లేదు. గుడికి వెళ్ళొస్తే పుణ్యం, పురుషార్థంతోపాటూ కొంచెం రిలీఫ్‌గా కూడా ఉంటుందని 'ఓకే' అన్నాను. కారు బయటకు తీసి నేనూ, నా భార్య బయలుదేరుతుండగా "బావా! నేను కూడా రానా" అడిగాడు రవి.

"అబ్బ! ఎంత కాలానికి వీడికి మంచి బుద్ధి పుట్టింది" అనుకుంటూ "రా! రా!" అంటూ ఆహ్వానించాను.


ముందు సీట్లో నా ప్రక్కనే కూర్చుని డోర్ లాక్ చేసాడు. వెనక సీట్లో నా భార్య రిలాక్సింగ్‌గా కూర్చుంది.

గేరు మార్చి కారుని ముందుకు దూకించాను.

"ఇంకేంటి రవీ విషయాలు. కొత్త జాబ్స్‌కి ఏమైనా అప్లై చేసావా?" కాజువల్‌గా అడిగాను.

"లేదు బావా! మొన్న వెళ్ళిన ఇంటర్వ్యూ రిజల్ట్ ఇంకా రాలేదు కదా! ఆ జాబ్‌కి సెలెక్ట్ అయినదీ లేనిదీ చూసుకుని అప్పుడు అప్లై చేస్తాను" అన్నాడు.

నవ్వొచ్చింది నాకు. "అప్పటి దాకా వెయిట్ చెయ్యడం దేనికి? టైమ్ వేస్ట్ తప్ప! ఈలోగా ఇంకోదానికి అప్లికేషన్ పెడితే మంచిదే కదా?" అన్నాను.



"ఆ చూద్దాంలే బావా! ఇప్పుడేం కొంపలు మునిగిపోయాయి!" అంటూ తేలిగ్గా తీసేసాడు. నిజమే మరి! నెలనెలా తండ్రి డబ్బు పంపిస్తుంటే ఎవడికైనా అలాగే ఉంటుంది.

ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఎర్రలైటు పడటంతో కారుకి బ్రేక్ వేసి ఆపాను.

పదేళ్ళలోపు వయసున్న ఇద్దరు ముగ్గురు చిన్నపిల్లలు చింపిరి జుట్టుతో, చిరిగిన బట్టలతో "ధర్మం చెయ్యండమ్మా" అంటూ ప్రతీ వాహనం దగ్గరికి వెళ్ళి అడుక్కుంటున్నారు. కాసేపటికి మా దగ్గరికి కూడా వచ్చి, విండోలోంచి చేతులు పెట్టి దానం చెయ్యమంటున్నారు. నేను జేబులోంచి చిల్లర తీస్తుండగా "వద్దు బావా! ఇలాంటి వాళ్ళని మనం ఎంకరేజ్ చేయకూడదు. ఇంత చిన్న వయసు నుండి అడుక్కుంటూ డబ్బు రుచి మరిగితే పెద్దయ్యాక వీళ్ళు ఏ రౌడీలగానో, గూండాలగానో తయారయి సమాజాన్ని దోచుకు తింటారు. ఇలాంటి వాళ్ళని తుపాకీతో కాల్చి సముద్రంలో పారెయ్యాలి" అంటూ ఆవేశంగా చెప్పాడు రవి. ఇంత చిన్న విషయానికి అంత ఎమోషన్ దేనికో నాకు అర్థం కాలేదు. అయినా 'తల్లిదండ్రుల మీద పడి దోచుకు తినడం కంటే ఇది నయమే కదా!' అని మనసులో అనుకున్నాను. ఆలోచనల్లో ఉండగానే గుడి వచ్చింది. రవి, నా భార్య దిగాక కారుని తీసుకెళ్ళి పార్క్ చేసాను.

* * *

గుడి వాతావరణం చాలా సందడిగా ఉంది. అయినా అందులోనే ఏదో తెలియని ప్రశాంతత! బహుశా అది మన సంస్కృతిలోనే అంతర్లీనంగా ఉన్న దైవత్వం వలన వచ్చినది కాబోలు!

చెప్పులు విడిచిపెట్టి గుళ్ళోకి వెళ్ళాం. గుడి అంతర్భాగంలోని 'సాయిబాబా' విగ్రహం చిరునవ్వులు చిందిస్తూ ఈ జనవిన్యాసాల్ని చిద్విలాసంగా చూస్తున్నట్లుగా ఉంది. ఆ దివ్య మంగళ స్వరూపానికి చేతులెత్తి దండం పెట్టుకొని ప్రసాదం తినడం కోసం అక్కడే కూర్చున్నాం. అప్పుడొక చిన్న సంఘటన జరిగింది!

గుడి ప్రాంగణంలో ఇద్దరు ముష్టివాళ్ళు సంభాషించసాగారు. ఆ ఇద్దరిలో ఒకడు పెద్దోడు. ఇంకోడు చిన్నోడు. పెద్దోడికి ఒక కాలు లేదు. చిన్నోడికి ఒక చెయ్యి లేదు. ఇద్దరూ వికలాంగులే! పెద్ద ముష్టోడు చిన్న ముష్టోడ్ని అంటున్నాడు.

"ఏరా! చెత్త నాయాలా! నిన్ననగా పది రూపాయిలు తీసుకున్నావు. మళ్లీ తిరిగివ్వలేదు. ఎప్పుడ్రా ఇత్తావ్?"

"ఎక్కడ మావా! రోజంతా కూసున్నా బొచ్చెలో పైసా పడ్డం నేదు. రేపు నూత్తాన్లే మావా!" కేర్‌లెస్‌గా అన్నాడు చిన్నోడు.

"ఏంట్రా నువ్విచ్చేది! సాయంకాలం అవంగానే

సారా కొట్టుకు పరిగెడతన్నావు. పొద్దుట్నుండీ గుడి దగ్గర అడుక్కుంటే రాలే డబ్బులన్నీ మందుకే తగలెత్త న్నావు. పైగా నాలోటోల్ల దగ్గర అప్పులూకటి! ఏదో నీ పెళ్ళాం రావులమ్మ నాలుగిల్లల్లో పనిసేయబట్టి కుటుంబం నడుత్తాంది. ఒల్లు దగ్గరెట్టుకునుండ్రా ఎదవా!" అంటూ తిడుతున్నాడు పెద్దోడు.

ఈలోగా ఒక 'వ్యక్తి' స్టైలుగా నడుచుకుంటూ గుళ్ళోకి వస్తున్నాడు.

కళ్ళకి కూలింగ్ గ్లాసెస్, కాళ్ళకి నిగనిగలాడే బ్లాక్ షూస్‌తో గొప్పగా ఉన్నాడు. అతడ్ని చూడగానే ఈ ముష్టోళ్ళిద్దరూ ఏక్టివ్ అయిపోయారు.

"బాబూ! ధర్మం సెయ్యి బాబూ!"

"అయ్యా! ధర్మం సెయ్యం దయ్యా!"

"దయసూపు సామీ!" అంటూ అడుక్కోవడం ప్రారంభించారు.

అయినా ఆ స్టైలు వ్యక్తి వీళ్ళని కేర్ చెయ్యకుండా ముందుకెళ్ళసా గాడు. ముష్టోళ్ళిద్దరికీ ఒళ్ళుమం డింది.

"సూద్దానికి డాబుగా వున్నాడు. పైసా ధర్మం సెయ్యడా నికి సెయ్యి రాడం లేదు. పైన పటారం! లోన లొటారం!" అంటూ తిట్టసాగాడు చిన్నము ష్టోడు.

"ఒరేయ్! ఊరుకోరా నువ్వు. మనకెందుకు, ఆళ్ళిష్టం!" వారిం చాడు పెద్దోడు. ఆ స్టైలు వ్యక్తి వెనక్కి తిరిగి వీళ్ళిద్దరి దగ్గరకీ వచ్చాడు.

"ఏరా! చూడ్డానికి దుక్కల్లా ఉన్నారు. పనీ పాటా చెయ్యకుండా ఇలా అడుక్కోవడానికి సిగ్గుగా లేదు. పైగా డైలాగులు కొడుతు న్నారు" అంటూ అరిచాడు.

"ఏంది సార్! మీరు సెప్పేది? మాకు బతకడానికి దారినేక అడు క్కుంటున్నాం. మీకేటి సార్. ఎన్నైనా చెబుతారు. అదురుష్టమంతులు! మాకూ మీనాగే అన్నీ వుంటే ఎన్ని నీతులైనా సెబుతాం" అంటూ మూలిగాడు పెద్దోడు.

సమాధానంగా ఆ స్టైలు వ్యక్తి చిన్నగా నవ్వాడు.

"చూడండి బాబూ! మీరన్నట్లు నాకు అన్నీ లేవు. నేను కూడా మీలాంటివాడినే" అంటూ తన కళ్ళజోడు తీసాడు. అతడికి ఒక కన్ను లేదు. కుడి కాలి పేంటు పైకి లేపి చూపించాడు. ఒక కాలు లేదు. కృత్రిమ కాలు అమర్చుకున్నాడు. అతడు చెప్పసాగాడు.



"కొంతకాలం క్రితం జరిగిన ఏక్సిడెంట్‌లో నాకు ఈ వైకల్యం సంభవించింది. అయినా నేను మీలా విధిని తిట్టుకుంటూ కూర్చోలేదు. ధైర్యంగా పోరాడి నా జీవి తాన్ని నిలబెట్టుకున్నాను. నాలుగు డబ్బులు సంపాదిం చుకున్నాను. మీలాంటివాళ్ళకి నీతులు చెప్పే స్థాయిలో ఉన్నాను. మీరు కూడా ఆలోచించండి. కష్టపడి సంపా దించడంలో ఉండే 'తృప్తి' ఇలా అడుక్కుని సంపాదించ డంలో ఉండదు. అర్థమైందా?" అంటూ గుళ్ళోకి వెళ్ళి పోయాడు. అతడు చెప్పింది ఆ ముష్టోళ్ళిద్దరికీ అర్థ మైందో లేదో తెలియదు కానీ ఆ సంఘటన మొత్తం చూస్తున్న 'రవి'కి మాత్రం ఏదో స్ఫురిం చింది.

* * *

గుడి నుండి తిరిగొస్తుండగా గమనించాను- వెళుతున్నప్పుడు రవిలో ఉన్న కేరెలెస్‌నెస్ ఇప్పుడు లేదు. ఏదో ఆలోచనలో ఉన్నట్లు మౌనంగా ఉన్నాడు. ఇందాకటి 'గుడి సంఘటన' అతడిలో ఏవో ఆలోచనా ప్రకంపనాల్ని సృష్టించినట్లుంది. ఇంటికొచ్చాక అడిగాను. "ఏంటి రవీ! సడన్‌గా అలా స్తబ్ధుగా అయిపోయావు" అని.

"ఏం లేదు బావా! ఇంతకాలం నాలో ఉన్న లోపాన్ని గమనించలేకపోయాను. అది ఈరోజు అవగతమయింది. థియరీ కంటే ప్రాక్టికల్‌గా చెబి తేనే కదా అర్థమవుతుంది. ఇన్నాళ్ళూ మీరు ఎన్ని సార్లు చెబుతున్నా కేర్ చెయ్యకుండా నా కెరీర్ గురించి తేలిగ్గా తీసుకున్నాను. ఈ సమాజాన్ని, మనుషుల్ని తిట్టుకుంటూ గడిపేవాడిని. నాకు రిక మెండేషన్ లేకనో, రిజర్వేషన్ లేకనో ఉద్యోగాలు రావడం లేదనేవాడిని. అన్నీ సక్రమంగా ఉన్నా ఏదో లేదనుకొని, ప్రయత్న రహితుడనై ఎస్కేపి స్టుగా మారిపోయాను. ఏ పనీ చెయ్యలేననుకొనే 'వికలాంగుడి'గా తయారయ్యాను. కానీ మనిషికి అన్నిటికంటే పెద్ద అసమర్థత అతడి 'మానసిక వైకల్యమే' కదా! ఈరోజు నేను దాన్ని అధిగమిం చాను. థాంక్యూ బావా! గుడికి తీసుకెళ్ళి నా కళ్ళు తెరిపించావు" అంటూ వెళ్ళిపోయాడు. చాలా హేపీగా అనిపించింది నాకు. రవిలో వచ్చిన ఈ 'మార్పు'కి కారణం ఆ 'బాబా' ఆశీస్సులే అని పించి చెప్పలేనంత ఆనందం కలిగింది.

## పనీపాటా లేనివాళ్ల పని

కత్రినా కైఫ్-సల్మాన్ ఖాన్‌ల దోస్తీ గురించి అందరికీ తెలిసిందే. అయితే ఎవరు పుట్టించారోగానీ ఈమధ్య సడెన్‌గా జాన్ అబ్రహాంకి కత్రినా దగ్గరైందని ఇద్దరూ 'ఫ్రెండ్సయి'పోయారని హాట్ హాట్‌గా ప్రచారం మొదలయ్యేసరికి కత్రినా ఒక్కసారిగా గయ్యిమంది. 'పనీపాటాలేని వాళ్లు ఇలాంటి పుకార్లు పుట్టిస్తున్నారు. అసలు ఎందుకు ఇలా చేస్తారో అర్థంకాదు. ఈ వార్త విని సల్మాన్ కూడా కోపంతో ఊగిపోయాడు. అయినా జాన్-బిపాషాల గురించి తెలిసి కూడా ఇలాంటి వార్తలు ఎందుకు పుట్టిస్తున్నారో ఆ దేవుడికే తెలియాలి' అని దండం పెట్టేసింది.